# మధ్య నిలచిన మనిషి

పొలం గట్టునుంచి పొద్దుపొయ్యాక ఇంటితోవ పట్టాడు సీతారాం!

అప్పటికే ఒకరిద్దరు రైతులు ఇళ్ళకు పోతూ అడిగారు. "బాబు గారు ఏదో, ఆలోచిత్తన్నారు. ఒంటిగా ఉన్నారు." అని, ఒంటరిగా ఉండటం ఏదో చేయగూడని అపరాధం! మనిషి కాస్తంత ఏకాంతము. విశ్రాంతి కోరుకోడం అందరికీ వింత !

రోజూ ఆఫీసుపని పూర్తికాగానే అలా మాధవయ్య హోటలుకు వెళ్ళి కాస్త కాఫీ త్రాగి. అలా ఊరి బయట పొలాలవైపు వెళ్ళడం అతనికి అలవాటు. చీకటి పడుతూ ఉంటె ఎవరో ఒకరు పలకరిస్తారు.

"ఏం బాబుగారు, ఒంటరిగా ఉన్నారు" అని. అది ఇంక ఇంటికి వెళ్ళడానికి సిగ్నల్. అంతకన్నా ఆలశ్యమైనా విశాల ఊరుకోదు. అంత వరకు ఎలానో ఓర్చుకుంటుంది. ఎప్పుడో ఒకసారి ఆవిడకు చెప్పాడు. "ఆఫీసరు మంచివాడుకాదు. ఆఫీసు కాగితాలన్నీ పూర్తిగా సైపు చేసి ఇస్తేనే కాని వదలడు." అని. విశాల నమ్మింది. అంచేత కాస్సేపు ఆఫీసరును తిడుతుంది. ఆ తరువాత ఓపికలేక సీతారాంను సాధిస్తుంది." ఇంటిక్ రావాలన్న ధ్యాసలేదు. భార్య ఎందుకు! ఒకరిమీద మమకారం. మరొకరితో సంసారం దొంగ బ్రతుకులోపం సుఖం!" అలా అలా సాగుతుంది, చివ రకు ఏడుస్తుంది ఈ గొడవ భరించలేడు.

నిజానికి ఆఫీసరు చాలా మంచివాడు. అయిదు కాకముందే హాయిగా వెళ్ళి పోతాడు. అయినా తనకు ఇంటికి వెళ్లాలనుండదు, ఇంట్లో సంతో షంగా ఎదురుగా చూడటానికి ఏముంది, ఎప్పుడూ విశాల ఏదో సాధిం

పుతో ప్రారంభించి ఏడుపుతో ముగిస్తుంది అంచేత ఆ కొంపకు వెళ్ళడానికి ఏం ఉత్సాహం ఉండదు. వీలైనంతవరకు దూరంగానే ఉంటాడు. పదేళ్ళుగా ఈ బ్రతుకు ఇలానే సాగుతోంది. విశాలతో వాదించి లాభంలేదు. నెమ్మదిగా చెప్పినా, మందలించినా ఆమెకు అర్థంకాదు. ఇంకా ఇంకా కోపం రెచ్చి పిచ్చిదానిలా ఉంటుంది. చివరకు హిస్టీరియా వచ్చి విరుచుకు పడుతుంది. ఇరుగు పొరుగు వింటారన్నభయం ఆమెకులేదు, అది తనకు విపరీతంగా ఉంది. తను ఉంటున్నది ఒక చిన్న వాటా! అందులో మెల్లిగా మాట్లాడినా అందరికి వినపడుతుంది. ఇరుగు పొరుగు సానుభూతితో చూసినా తనకేదో అవమానంగా ఉంటుంది అంచేత విశాలకు ఏమీ చెప్పడు, సాధించి సాధించి విసుగెత్తి ఆమే ఊరుకుంటుంది.

చిన్నప్పుడు సొంత ఊళ్ళో గోవిందబాబుగారి తోటలో తనూ, తల్లీ ఒక చిన్న పాకలో ఉండేవాళ్ళు, గోవిందబాబుగారిది చాలా పెద్ద బంగళా, చుట్టూ పెద్ద తోట. పెద్ద మామిడితోపు. అందులో పెద్ద బావి. దాని దగ్గర ఒక గుడి, గోవిందబాబుగారి నౌకర్లు తోటలోనే పాకలు వేసుకున్నారు. అంత పెద్ద బంగళాలో గోవిందబాబు ఒక్కడే. ఆయనకు ఒకత్తే కూతురు. ఆమె ఎప్పుడూ పట్నంలోనే ఉంటుంది. ఎప్పుడైనా పిల్లలతో వస్తుంది. తన తల్లి ఆయనకు వండిపెట్టేది. ఆయన ఇచ్చిన డబ్బుతో తనను చదివించేది. తనకు చిన్నప్పుడు అంత చురుకుగా చదువబ్బలేదు. ఒకసారి వేసవి సెలవుల్లో ఆయన మనుమరాలు పార్వతి వచ్చింది. పార్వతి తనకన్నా మూడేళ్ళు పెద్దది. ఆ పిల్లను తను చూసి చాలా ఏండ్లయింది. ఈ మధ్య ఆ పిల్ల ఎప్పుడూ పల్లెకురాలేదు. చిన్నప్పుడు ఎప్పుడో పార్వతితో ఆడుకున్నాడు. కాని పెద్దయ్యాక ఆ పిల్లతో మాట్లాడటానికి భయం వేసింది. పట్నంలో నాగరికంగా మసలే ఆ పిల్ల పల్లెలోనే పాడుకుపోయిన తన్ను మొరటు అనుకుంటుదేమో!

ఒక రోజు ఆ పిల్లే తనను పలకరించింది. సాయంత్రంవేళ తోటలో తన దగ్గరకు వచ్చింది. "అలా ఆ మామిడి తోపులోకి వెళదాం వస్తావా?" అంది. తాను సంకోచంగా ఊరుకున్నాడు. అంతలో అమ్మ అన్నది. "వెళ్ళరా! అమ్మాయికి పాపం పొద్దుపోవటంలేదు." తనకు వెళ్ళక తప్ప లేదు.

ఆరోజునించి ఆమెతో మామిడి తోపులోకి షికారు వెళ్ళడం అల వాటైంది. ఆ పిల్లమీద విపరీతమైన అనురాగం ఏర్పడింది. ఆ పిల్ల తనతో చిలిపిగా ఆడుకుంది. ప్రేమతో కౌగిలించింది. ఒకరోజు గుడికి వెళ్ళారు. అక్కడ ఒక్క క్షణం నిలబడ్డారు. అంతలో పార్వతి తన్ను కౌగిలించుకుంది. మనస్సు పరవశమైంది. అక్కడ ఎవరూ లేరు. ఆ క్షణం దేవుని ఎదట తమకు వివాహమైనట్టనిపించింది. ఆ బంధం ఎవరూ విడ దీయలేరనుకున్నాడు. వికసించిన మనస్సుతో ఇంటికి వెళ్ళాడు. మర్నాడు పార్వతి ఊరికి వెళ్ళింది.

పార్వతి తమ అనుబంధం అందరికీ చెబుతుందనుకున్నాడు. త్వర లోనే తను ఆమెను కలుసుకుంటాననుకున్నాడు. ఆ తరువాత తెలిసింది. పార్వతికి పెళ్ళి నిశ్చయమైందని, పెళ్ళికొడుకు పెద్ద ఉద్యోగస్థుడని! తన్ను ఎవరో కొరడాతో కొట్టి నిద్ర మేల్కొలిపినట్లయింది. దిగ్భ్రాంతితో దిక్కు తోచలేదు. మనసు భరించలేని బాధతో కుమిలిపోయింది అప్పుడు తెలిసింది. ఆమె తనకన్న పెద్దది. ఆమె అంతస్థు వేరు, తన అంతస్థు వేరు. తనకు చదువు లేదు. ఉద్యోగం లేదు. వెర్రిగా పార్వతి చూపిన చనువుచేత అందని పండుకు ఆశపడ్డాడు. మనసులో ఏదో ఆరని పుండులా ఉంది.

పార్వతికి పెళ్ళి అయింది. గోవిందబాబు, తనతల్లి ఇంకా కొంత

మంది నౌకర్లు అందరూ పెళ్ళికి వెళ్ళారు. అంత తోటలో అంత ఇంటిలో తాను ఒంటరిగా మిగిలాడు. ఇల్లు బావురుమంటోంది. మనసు బావురుమంటోంది. ఆ నాలుగురోజులు తాను అనుభవించిన శూన్యం జీవితంలో మరపురానిది. క్రమంగా పెళ్ళికి వెళ్ళినవాళ్ళు తిరిగివచ్చారు. మళ్ళా ఇల్లు సందడిగా ఉంది. జీవితం మామూలుగా సాగుతోంది. మనసు శూన్యంగా ఉంది.

కొన్నాళ్ళకు తనకు పార్వతిని చూడాలనిపించింది. అది అణచుకోలేని తపన అయింది. పార్వతి తనకేదో అన్యాయం చేసినట్లనిపించింది. అదే ఆమెను అడగాలనిపించింది. తను పట్నం వెళ్ళాడు. పార్వతి ఇంటికి వెళ్లాడు. అది చాలా పెద్దఇల్లు. కింద పెద్ద హాలు. ఖాళీగా వుంది. వాకిట్లో నౌకరు ఉన్నాడు. హాలులో ఒంటరిగా కూర్చున్నాడు. పార్వతి కోసం ఎదురుచూస్తూ! కాస్సేపటికి పార్వతి వచ్చింది. మేడదిగి తన్నుచూసి విస్తుపోయింది. "ఎందుకు వచ్చావ్?" అంది చిరాకుతో. తనకు ఏం చెప్పాలో తోచలేదు. నోరు మెదిపితే కంటివెంట నీరు వస్తుందేమోననిపించింది. ఆమె ఎక్కడికో వెళ్ళాలని తొందరపడుతోంది. అంతలో ఆమె భర్త కూడా వచ్చాడు. అతను ఆరడుగులమనిషి. అతనిముందు తాను మరీ వామనమూర్తిగా కుంచించుకుపోతున్నట్లనిపించింది. పార్వతి తన్ను పరిచయం చేసింది. "మా తాతగారి వంటావిడ కొడుకు" అంది నిర్లిప్తంగా. అతను 'ఓహో' అన్నాడు తేలికగా, మళ్ళా వెంటనే "మేము ఇప్పుడు ఒక పార్టీకి వెళ్ళాలి. ఇంకోసారిరా ఏదైనా పనిఉంటే!" అన్నాడు. సమాధానం కోసం ఎదురుచూడలేదు. ఇద్దరూ వెళ్ళిపోయారు. తను హాల్లో ఒంటరిగా మిగిలాడు. వెళ్ళిపోతూంటే నౌకరుకూడా తననేదో చులకనగా చూసినట్లనిపించింది. దుఃఖము, అవమానము మనసును కమ్ముకున్నాయి. మళ్ళా జన్మలో పార్వతిని చూడాలనిపించలేదు. ఆమె అంతస్తు వేరు. తన

అంతస్తు వేరు. ఆమె కాలక్షేపానికి కాస్సేపు తనతో ఆడుకుంది. నిర్లిప్తంగా నిముషంలో వదిలేసింది. మరువలేని మమతలు పెంచుకుని కుమిలిపోయే తను వెళ్లివాడు.

కొన్నాళ్ళకు తను సైవు నేర్చుకున్నాడు ఉద్యోగం సంపాదించుకున్నాడు. తల్లి చనిపోయింది. విశాలతో పెళ్ళైంది. విశాల అందకత్తె కాదు. పొట్టిగా, లావుగా, నల్లగా ఉంది. అయినా ఆమె తనమనిషి. అన్ని విధాలా తనను ఆదుకుంటుంది. మనసులో లోపల దాచుకున్న ఆవేదనలు ఎవరితోనూ చెప్పుకోలేని మాటలు ఆమెతో చెప్పుకోవచ్చు. అది తనకు ఊరట. పెళ్ళైన కొత్తలో ఒకరోజు ఆమెతో చెప్పాడు పార్వతికీ తనకు తాత్కాలికంగా ఏర్పడిన అనుబంధం గురించి. పార్వతి ఎలా తనకు భ్రమలు కలిగించింది, ఎలా తన కలలు భగ్నమైంది! ఆమె తనను ఓదారుస్తుందనుకున్నాడు. విశాలప్రేమలో పార్వతిని మరచిపోవచ్చనుకున్నాడు. కాని అలా జరగలేదు. అప్పుడు తనకు పసితనం. అనుభవంలేదు. కొత్తగా పెళ్ళైన పిల్ల వినకోరే మాటలు అవికాదని తనకు తెలియదు. ఆ మాటలు చెప్పవలసిన అవసరంలేదనీ తెలియదు,

చెప్పినది విని విశాల వెక్కి వెక్కి ఏడ్చింది. తాను ఆమెకు ఏదో ద్రోహం చేసినదానిలా బాధపడింది. ఇంకాస్సేపటికి విరుచుకుపడింది. ఆనాటి నుంచి ఆమె మామూలు మనిషికాదు. ఏదో రోగపీడితురాలిలా మారింది. ఆమె మనసులో పార్వతి నీడ విషంలా నిలచింది. ఆ తరువాత ఆమెలో అసూయ, ద్వేషమూ, ఎత్తిపొడుపు మాటలు, ఏడుపులు, మూర్ఛలు ఇవే మిగిలాయి. అనుమానం, అవమానం, అసూయ ఆమెను క్షణ క్షణం దహించి, తన్ను దహించింది. ఏనాడో తనకు దూరమై, ఎంతగానో తాను మరచిపోవాలని తపనపడుతున్న పార్వతి విశాల అసూయలో రంగులు

దిద్దుకుని విశాలకు తనకూ మధ్య నిలచింది. రోజులు గడుస్తున్నా విశాలలో మార్పులేదు. మారుతుందన్న ఆశలేదు.

అందుకే తాను ఇంటికి దూరమై అలమటిస్తున్నాడు. స్వచ్ఛమైన పాలలో విషబిందువు కలిసింది. నిర్మలంగా ఉండవలసిన బ్రతుకులో నీడ పడింది. విశాల చేజేతులా బ్రతుకు పాడుచేసింది. పార్వతిని తాను చూసి ఎన్నో ఏళ్ళయింది. చూడాలన్న కోరిక కూడా లేదు. అయినా మసకబారిన విశాల మనసు గ్రహించదు.

• • •

చీకటి పడుతోంది. ఇంక ఇంటికి వెళ్ళక తప్పదు. అడుగులు బరువుగా ముందుకు పడుతున్నాయి. ఆఫీసర్! మేనేజరుతో అంటున్న మాటలు మెదడులో వినిపిస్తున్నాయి.

"ఆ కాగితాలు సీతారాం కివ్వండి. అతనైతే జాగ్రత్తగా చెప్తాడు."— బండబారిన బ్రతుకులో అదొక్కటే అమృతకిరణం. ●